క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో పదవుల నియామకం



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురిని పార్టీ పదవుల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈమేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా మామిడి జోత్స్న, పెదనందిపాడు మండల అధ్యక్షుడిగా షేక్ ఖాశింపీరా, కాకుమాను మండల అధ్యక్షుడిగా కొమ్మాలపాటి రవికుమార్, ఎస్సీ విభాగానికి సంబంధించి మండల అధ్యక్షులుగా గుంటూరు రూరల్‌కు ఈపూరి రాజశేఖర్, ప్రత్తిపాడుకు కట్టా వెంకటేశ్వరరావు, వట్టిచెరుకూరు బుర్రి ప్రకాష్, పెదనందిపాడుకు తమలపాకుల సోమయ్య, కాకుమానుకు కట్టా మోహన్‌రావులను నియమించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ పొన్నూరు సాధ్యమవుతుందని, స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛ వాయువు అనే అంశంతో పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ.. మానవహారం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సిబ్బంది మోటార్ వాహనాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణానికి హాని కలిగించని సైకిళ్లను వినియోగించాలని సూచించారు. మొక్కలను నాటడం, చిన్నపాటి దూరాలకు నడిచి వెళ్లడం, యోగా, వ్యాయామాలను చేయడం వలన స్వచ్ఛమైన వాయువు లభిస్తుందని తెలిపారు.

పెదకాకానిలో ధన్వంతరి జయంతి వేడుకలు



పెదకాకాని: ధన్వంతరి జయంతి వేడుకలు పెదకాకాని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, పెదకాకాని శ్రీ గంగ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థాన కళ్యాణ కట్ట సభ్యులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యులు హరిబాబు మాట్లాడుతూ ధన్వంతరి వైద్యం చరిత్ర వివరించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవాసంఘం పెద్దలు కొమ్మూరి మల్లికార్జునరావు, గుంటూరు జిల్లా నాదస్వర కమిటీ కన్వీనర్ మున్నంగి బాజీరావు, ల్యాబ్ టెక్నీషియన్ బత్తుల రాంబాబు, నాదస్వర కమిటీ మున్నంగి శివ, కాకాని సుబ్బారావు, మాజీ సొసైటీ అధ్యక్షులు ముక్కెర రాజు, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు కాకాని సదాశివరావు, జిడుగు రాజశేఖర్, కొమ్మూరు వెంకట్రావు, ఉండవల్లి శంకర్రావు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి



నెహ్రూ నగర్: విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతూ.. చదవగలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కెనరా బ్యాంక్ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.నర్సిరెడ్డి పేర్కొన్నారు. రెడ్డి జన సేవా సమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సిరెడ్డి ఎంతో ఉన్నతంగా ఆలోచించి ఆనాడు రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి.. ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారన్నారు. ఆయన స్ఫూర్తిగా అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగుతూ దాతలు ఇచ్చిన సహకారంతో ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ కార్డియాలజిస్ట్ జీఎస్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వెలగల జయ పాల్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో మండలి నాయకులు చల్లా అంజిరెడ్డి, కంది సంజీవరెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పోలూరి వెంకటరెడ్డి, జంగా సత్యనారాయణ రెడ్డి, వణుకూరి సూరారెడ్డి పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

- ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు జోగి ఆనంద్‌బాబు
- 'సాక్షి'పై వేధింపులను నిరసిస్తూ తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

ప్రత్తిపాడు: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజాగొంతుకగా నిలుస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటాన్ని పాత్రికేయులు ముక్తకంఠంతో ఖండించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ నినదించారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులపై అక్రమంగా కేసులు మోపడంతో పాటు తనిఖీలు, సోదాలు, నోటీసుల పేరుతో వేధిస్తుండటాన్ని నిరసిస్తూ నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాపాడాలి పత్రికా స్వేచ్ఛను.. ఎత్తివేయాలి అక్రమ కేసులు.. అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయంలో తహసీల్దార్ సుజాతకు మెమొరాండం అందించారు. జోగి ఆనంద్‌బాబు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.ఆదేశ్వరరావు మాట్లాడుతూ పాత్రికేయుల హక్కులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపైనా ఉందని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జెట్టి పరమేశ్వరరావు, విలేకరులు కె.సుబ్బయ్య, పి.జయపాల్, ఎస్.వీరభద్రం, వీరయ్య, షేక్ షరీఫ్, పానకల శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, షేక్ షరీఫ్, కె.పవన్, మామిళ్లపల్లి సుబ్బారావు, అశోక్ పాల్గొన్నారు.

ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ కనస్ట్రక్షన్‌పై సెమినార్



మాట్లాడుతున్న రవిచంద్ర

గుంటూరు రూరల్: నిర్మాణ రంగంలో ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్ సాంకేతికత ఒక విప్లవాత్మక మార్పు తెచ్చిందని హైదరాబాద్‌కు చెందిన యాక్సిస్ ఈ-టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్, స్ట్రక్చరల్ ఇంజినీర్ రవిచంద్ర దాసరి పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్‌లో హర్నెస్సింగ్ ఇన్నోవేషన్ అండ్ చాలెంజ్ ఇన్ ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ-ఇంజనీర్డ్ బిల్డింగ్ టెక్నాలజీ ప్రాధాన్యత, ఆధునిక నిర్మాణ రంగంలో దీని వృద్ధి అవకాశాలు, ఎదుర్కొంటున్న సవాళ్లపై సమగ్ర అవగాహన కల్పించారు. రవిచంద్ర మాట్లాడుతూ పీఈబీ నిర్మాణ పద్ధతిలో భవన భాగాలు డిజైన్‌కు అనుగుణంగా ఫ్యాక్టరీలో తయారు చేయబడి, నిర్మాణ స్థలంలో కేవలం అసెంబుల్ చేయబడతాయన్నారు. దీని వల్ల నిర్మాణ సమయం తగ్గడమే కాకుండా, తక్కువ వ్యయంతో వేగవంతమైన సుస్థిరమైన నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. శక్తివంతమైన నిర్మాణాల దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా విస్తృత అవకాశాలు ఉన్నాయని, నూతన సాంకేతికతలలో ప్రావీణ్యం సాధిస్తే గ్లోబల్ స్థాయిలో ప్రగతి సాధించవచ్చని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ కృష్ణసాయి పాల్గొన్నారు.

అలరించిన వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర



నగరంపాలెం: స్థానిక సీతమ్మకాలనీ ఒకటో వీధిలోని శ్రీఅంకమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో ఏపీ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి నాటక అకాడమీ(విజయవాడ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి చరిత్ర పౌరాణిక భక్తి రస నాటిక ప్రదర్శించారు. హార్మోనియంపై వేణుగోపాల్, క్లారినెట్ రంగారావు, డోలక్‌పై మోపర్రు శ్రీను, డి.చిన్నబాపిరెడ్డి సంగీత సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో వెంకటరమణ నాట్యమండలి అధ్యక్షులు బాణాల సుబ్బారావు (గుంటూరు), 28వ డివిజన్ అధ్యక్షులు తెల్లగుర్ల అప్పారావు, పౌరాణిక కళాకారుల సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

ప్రత్తిపాడు: సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు మెరుగు పరుచుకోవాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్(కిట్స్) కళాశాలలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో సీఎస్ఈ- ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో వైబ్ కోడింగ్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసర్ డిజిటల్ ఏఐ ఎం.విజయ్ కుమార్ పరిశోధన, డెవలప్ ఇంజినీర్, విద్యార్థులకు ఏఐ, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. విభాగ శిక్షకులుగా హాజరైన సీహెచ్ రమేష్(గ్రాడ్ ఎక్స్‌పర్ట్, విశాఖపట్నం), రెడ్డి సురేష్(ఆక్సెంచర్, హైదరాబాద్), సీహెచ్ సత్య గోపాల్ (విటు మైండ్స్ సాఫ్ట్‌వేర్) విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. అసోసియేట్ ట్రైనర్లు మణి సీహెచ్, జ్యోతి, ప్రియాలు ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, కోడింగ్ వ్యూహాలు, సాంకేతిక సమస్యల పరిష్కార మార్గాలను వివరించారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ నిపుణుల మార్గదర్శకత్వంలో యువ ఇంజినీర్లు ముందుకు సాగాలన్నారు. సాంకేతిక ఆవిష్కరణల్లో తమ కళాశాల విద్యార్థులు ముందంజలో ఉండాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని వివరించారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్ర మే కాకుండా సృజనాత్మక ఆలోచనలు, సమస్యలకు పరిష్కార నైపుణ్యాలను కూడా నేర్పుతున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.హరి బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, ఏఐ ఎంఎల్ విభాగాధిపతి జి.మురళి, కన్వీనర్ ఎస్.కె. ఆయేషా పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



మొక్కలు నాటుతున్న అధికారులు

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సర్పంచి నల్లపాటి లలితకుమారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నడక ర్యాలీ, సైకిల్ ర్యాలీ, ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముఖ్య తిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ గాలి నాణ్యత, ప్రమాణాలు, కలుషిత గాలి వలన కలిగే దుష్ఫలితాలు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్ మాట్లాడుతూ పరిశ్రమలు, మోటార్ వాహనాల వలన కలిగే గాలి కలుషితం గురించి వివరించారు. సీఆర్‌డీఏ హార్టికల్చర్ అండ్ ప్లాంటేషన్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతిలో జీవ సమతుల్యత, చెట్లు నీటి చెరువుల ఆవశ్యకత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాస్, డెప్యూటీ ఎంపీడీఓ కే శ్రీనివాస్, ప్రత్తిపాడు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం డీఈఈ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి వి.రవి పాల్గొన్నారు.

పలు విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి వేడుకలు



టపాసులు వెలిగిస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు



దీపావళి సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని బుడంపాడులోని ప్రాడిజి విద్యాలయంలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నరకాసుర వధ సందర్భంగా నిర్వహించే వేడుక దీపావళి అని తెలిపారు. కార్యక్రమంలో నరకాసుర వధ, టపాసుల కాల్చులు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రధినిచౌదరి, ఉపాధ్యాయుడు సురేష్ పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో..

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ముందస్తు దీపావళి సంబరాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య, దీపావళి ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. కలాశాల ప్రాంగణంలో దీపాలను వెలిగించి టపాసులు కాల్చి, సంప్రదాయ వస్త్రధారణలతో సంబరాలు జరిపారు.

22న ఏఐఎస్ఎఫ్ బస్సు జాతా పోస్టర్ల ఆవిష్కరణ

లక్ష్మీపురం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి నవంబర్ 12 వరకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి బస్సు జాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త విద్యార్థి ఉద్యమానికి సిద్ధమవుతూ చేపట్టిన బస్సు యాత్రను విద్యార్థులు, మేధావులు, తల్లిదండ్రులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్, చందు, సుభాష్, అమీర్ పాల్గొన్నారు.

పెదకాకాని- వెనిగండ్ల రోడ్డుకు శంకుస్థాపన

పెదకాకాని: పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి వెనిగండ్ల పొలిమేర సెంటర్ వరకూ రోడ్డు విస్తరించి రోడ్డుకు ఇరువైపులా సైడు డ్రెయిన్‌లు నిర్మించే పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. సుమారు 1.3 కిలోమీటర్లు రోడ్డుకు ప్రభుత్వం 3.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. అలానే అగతవరప్పాడు గ్రామంలో 55 లక్షల రూపాయలతో నిర్మించే రోడ్లుకు అధికారులతో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

పారిశుద్ధ్య విధుల్లో బాధ్యతగా ఉండాలి



వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్య విధుల్లో సిబ్బంది, అధికారులు బాధ్యతగా పనిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గుండారావుపేటలో పారిశుద్ధ్య పనులు, చెక్కల బజార్‌లో ఆక్రమణలను శనివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. గుండారావు పేట, జీటీ రోడ్లలో డ్రెయిన్ల అపరిశుభ్రతపై స్థానిక ప్రజారోగ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలను మధ్యాహ్నం సమయంలో శుభ్రం చేయాలని, కాలువల్లో టీ కప్పులు, వ్యర్థాలు వేసే షాపులను సీజ్ చేసి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకే చెత్త ఇవ్వాలే తప్ప రోడ్ల మీద, కాలువల్లో వేయవద్దని సూచించారు. డ్రైన్, రోడ్ ని ఆక్రమణ చేసిన చెక్కల బజార్ లో ఆక్రమణలను తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. జీటీ రోడ్ లో ఆక్రమణల తొలగింపు అనంతరం నూరుశాతం పూడిక తీయించాలని ఇంజినీరింగ్ అధికారులను, ఆక్రమణలు పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలి..

అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని, పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, ఏమైనా లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం పల్నాడు బస్టాండ్ సెంటర్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్ల పరిసరాల్లో ఆహారం తీసుకునే వారికి ఇబ్బంది లేకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులు కల్పించేలా పర్యవేక్షణ కోసం వార్డు సచివాలయ కార్యదర్శులను కేటాయించామని, వారు నిర్దేశిత సమయంలో క్యాంటీన్‌లో ఉండాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంకు అధిక ప్రాధాన్య ఇవ్వాలని కోరారు.

విద్యుత్ భవన్‌లో సూపర్ జీఎస్టీపై అవగాహన



మాట్లాడుతున్న చల్లా రమేష్, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌బాబు

కొరిటిపాడు(గుంటూరు): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ సంస్కరణల వలన పునరుత్పాదక శక్తి పరికరాలపై జీఎస్టీ భారీగా ప్రయోజనాలు కలుగుతాయని విద్యుత్ శాఖ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ చల్లా రమేష్ పేర్కొన్నారు. పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ భవన్‌లో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సౌరశక్తి, పవన్ శక్తి, జల విద్యుత్ పరికరాలపై జీఎస్టీ తగ్గిందని వివరించారు. అలాగే బయోగ్యాస్ యూనిట్ ధర గతంలో రూ.1.50 లక్షలు ఉండగా, ఇప్పుడు రూ.1.40 లక్షలు అని పేర్కొన్నారు. ఐదు హెచ్‌పీ సౌర పంపుసెట్ ధర గతంలో రూ.2.50 లక్షలు ఉండగా, నేడు రూ.2.21 లక్షలకు చేరుకుందని తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్క నెలలో చాలా ఆదా చేయొచ్చన్నారు. మన ఇంటి డాబా పైన సోలార్ పలకలు బిగించుకోవడం వలన మన కరెంట్ బిల్లుని ఆదా చేసుకోవచ్చని, దీని ద్వారా జీఎస్టీ 2.0 సంస్కరణలు గతంలో ఉండేదని, ఇప్పుడు ఐదు శాతం తగ్గించడం జరిగిందన్నారు. పీఎం సూర్య ఘర్ వెండార్ వారు విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు, రూ.999 కట్టినచో ఇంటి మీద సోలార్ పలకలు బిగించుకోవచ్చన్నారు. పీఎం సూర్య ఘర్‌పై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. సదస్సులో విద్యుత్ శాఖ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.నాగేశ్వరరావు, టౌన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాస్‌బాబు, పి.రామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు నేర్చుకోవాలి

జన విజ్ఞాన వేదిక నాయకుడు ఏవీ రమణయ్య



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో కళాశాలలో విద్యార్థులు, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి రామచంద్రరావు అధ్యక్షత వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ఏవీ రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి చేయటం వలన జీవితంలో వచ్చే ఏ సమస్యల్ని అయినా అవలీలగా అధిగమించ వచ్చన్నారు. జిల్లా అధ్యక్షుడు బొంతు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏవిషయమైనా పాజిటివ్‌గా స్పందించి శాస్త్రీయ విజ్ఞానాన్ని మేళవించి ఆచరించడం ద్వారా, మూఢ నమ్మకాలను తొలగించటం ద్వారా సమాజానికి మేలు కలుగుతుందని చెప్పారు. పాఠశాల ఇన్‌చార్జి మాట్లాడుతూ నేటి కాలపు విద్యార్థులు కాలేజీ టెక్స్టు బుక్స్ కన్నా మొబైల్ టెక్స్ట్ మెసేజ్‌లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు చెప్పే నైతిక విలువలకు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని వాపోయారు. నేటి విద్యార్థుల జీవితంలో పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కన్నా మొబైల్ ఫోన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని, ఎక్కువ మంది విద్యార్థులు పెడ పోకడలకు ఆకర్షితులై భవిష్యత్‌ని నాశనం చేసుకుంటున్నారన్నారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి, వీరగంగాధరరెడ్డి, జేవీవీ జిల్లా కార్యదర్శి వీవీ రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్.వెంకటసుబ్బయ్య, కె.ఎస్. రామేశ్వర్ రెడ్డి, జయభారతరెడ్డి, చలమారెడ్డి, రేచేటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంద్రమౌళి, ధర్మరాజు, ఫిజికల్ డైరెక్టర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి

- సీపీఎస్‌పై ఆమోదయోగ్యమైన నిర్ణయం ఏదీ..?
- ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు

ప్రత్తిపాడు: ప్రభుత్వం పీఆర్సీ కమిటీని నియమించి మధ్యంతర భృతి ముప్పై శాతం ప్రకటించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. స్థానిక హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ ప్రత్తిపాడు జోన్ పరిధిలోని ఆయా మండలాల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. బసవలింగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదహారు నెలలు గడిచినప్పటికీ ఇంత వరకు 12వ పీఆర్సీ కమిషన్ నియమించలేదని ఆరోపించారు. వెంటనే కమిషన్ చైర్మన్‌ను నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే రెండు డీఏలు విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌పై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పిన ప్రభుతం ఇంత వరకు దాని ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి జి.దాస్ మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు,ఉపాధ్యాయులకు భారమైన అసెస్‌మెంట్ బుక్‌లెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.పార్వతి, సీనియర్ నాయకులు ఎస్. రాంబాబు ప్రత్తిపాడు, పెదనండిపాడు మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. వెంకటేశ్వరరెడ్డి, వి.మరియరాజు, వి.వందనం, సీనియర్ నాయకులు నాగరాజు, లక్ష్మయ్య, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్ రాజు, శరత్, కుంభా శ్రీనివాసరావు, వేణు గోపాలరావు, ప్రేమ కుమార్ పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రత్తిపాడు బ్రాంచ్ (07084), ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522019

స్వాధీనత ప్రకటన

(APPENDIX-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002

రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్థి కొరకు)

[illegible] ... నోటీసు తేది నుండి 60 రోజులలోగా ... తేది.19.07.2025 నాటికి HTL A/c No.37319290355 కు రూ.8,66,328/- ... మరియు Suraksha A/c No.37310930460 కు రూ.53,058/- ... మరియు AHL A/c No.36140065596 కు రూ.19,39,819/- ... మరియు C.C A/c No.37333951086 కు రూ.9,78,988/- ... మొత్తం నాలుగు లోనులు బకాయి రూ.38,60,193/- ... [illegible]

[illegible] ... తేది.19.07.2025 నాటికి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. ... 15.10.2025 న లాంఛనప్రాయంగా స్వాధీనత తీసుకోవడమైనది ... తేది.19.07.2025 నాటికి రూ.38,60,193/- ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రత్తిపాడు బ్రాంచ్, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా ... [illegible]

స్థిరాస్థి వివరములు

ఆస్తి-1 : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-జిల్లా, ప్రత్తిపాడు గ్రామం & మండలం, ప్రత్తిపాడు గ్రామ ఆర్.ఎస్.నెం.761/A ... డాక్యుమెంట్ నెం.1107/2012, తేది.06.12.2012 ప్రకారం ... [illegible]

ఆస్తి-2 : [illegible] ... డాక్యుమెంట్ నెం.1107/2012, తేది.06.12.2012 ప్రకారం ... [illegible]

ఆస్తి-3 : [illegible] ... డాక్యుమెంట్ నెం.1107/2012, తేది.06.12.2012 ప్రకారం ... [illegible]

ఆస్తి-4 : [illegible] ... ఆర్.ఎస్.నెం.390/A ... [illegible]

(షెడ్యూల్ ఐటమ్ నంబర్ 3, 4, 5 & 10)

తేది : 15.10.2025 | సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ప్రత్తిపాడు | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com